క్లుప్తంగా

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాదుస్తులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, పోచా రాధాక్రిష్ణారెడ్డి

ఉయ్యాలవాడ: ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు సహకారం అందిస్తామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోచా రాధాక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 40 మందికి సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, పీఈటీ ప్రతాప్ వినతి మేరకు నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి స్పందిస్తూ క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాలలో ఖర్చుల కోసం ప్రతి నెలా రూ.3 వేలు అందజేస్తామని మాజీ సర్పంచ్ పోచా రాధాక్రిష్ణారెడ్డి హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

వర్షాలతో జాగ్రత్త



పాత మట్టి మిద్దెను పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసశర్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పాత మట్టి మిద్దెలను ఆయన పరిశీలించారు. దాదాపు 70 ఏళ్ల నాటి మట్టి మిద్దెలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. మిద్దె యజమానికి గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసిందన్నారు. ఈ నెల 10వ తేదీన వర్షాలకు ఎస్సీ కాలనీలో గుర్రం ఆశోక్‌కు చెందిన మట్టి మిద్దె కూలిపోయిందన్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. ఈ నెల 13న భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. పీఆర్ ఏఈ రవికుమార్, పంచాయతీ కార్యదర్శి అశ్వనికుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ అమానుల్లా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, సచివాలయాలకు వివిధ పనులతో వచ్చే ప్రజలకు సత్వర సేవలు అందించాలని చెప్పారు.

సీనియర్ అసిస్టెంట్ నియామకం

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా హేమ శంకర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మనోహర్‌రెడ్డి మూడు మాసాల క్రితం నంద్యాలకు బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో మహానంది మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న హేమశంకర్‌కు సీనియర్ అసిస్టెంటుగా పదోన్నతి కల్పిస్తూ ఉయ్యాలవాడకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నులిపురుగులను నివారించాలి



వైద్య సిబ్బందితో మాట్లాతున్న స్టేట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం

శిరివెళ్ల: ఈ నెల 12న జరగనున్న జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రోగ్రాం స్టేట్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. ఆయన సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాట్లపై సిబ్బందితో చర్చించారు. అనంతరం స్థానిక పాఠశాలు, యర్రగుంట్ల పాఠశాలలో విద్యార్థులు, టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యా శాఖ, ఐసీడీఎస్ శాఖ, వైద్య సిబ్బంది సమన్వయంతో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు నులి పురుగుల నివారణ మందులను అందచేస్తారన్నారు. వంద శాతం పిల్లలుకు మందులు వేయడం జరుగుతుందన్నారు. ప్రోగ్రాం జిల్లా అఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి, డాక్టర్ ముఖేష్ కుమార్, సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, హెచ్ఎంలు, టీచర్లు పాల్గొన్నారు.

గడువు లోపు సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల: జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పీజీఆర్ఎస్ సమస్యలపై నిర్లక్ష్యం చూపకుండా నిర్ణీత గడువు లోపు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్, డీఆర్‌ఓలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం చూపకుండా వేగంగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా స్వీకరించిన ప్రతి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంట్ పంపాలని చెప్పారు. ఇప్పటికే బియాండ్ ఎస్ఎల్ఏ ఉన్న దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతుల్లో కొన్ని..

- నంద్యాల పట్టణంలోని నడిగడ్డవీధికి చెందిన షేక్ నబిరసూల్ తనకు సొంత ఇల్లు లేదని ప్రస్తుతం బాడుగ ఇంటిలో ఉంటూ ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నానని, తనకు ఇంటి స్థలం మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- బండిఆత్మకూరు మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా తనకు భూమి లేదని, కానీ వేరే వాళ్ల భూమి తన పేరు మీద చూపడంతో తన కుమార్తెకు ప్రభుత్వం అందజేస్తున్న తల్లికి వందనం వర్తించలేదన్నారు. కావున తన పేరు మీద ఉన్న ఇతరుల భూమిని తొలగించి తనకు న్యాయం చేయాలని వినతి పత్రం సమర్పించారు.
- నంద్యాల మండలం కానాల గ్రామానికి చెందిన షేక్ ఖాజాబీ తన కుటుంబానికి చెందిన హౌసింగ్ మ్యాపింగ్‌లో గుర్తు తెలియని వ్యక్తిని చేర్చడంతో తమకు ప్రభుత్వ పథకాలు అందడం లేదని వెంటనే ఆ వ్యక్తిని మా హౌసింగ్ మ్యాప్ నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.



చెక్కు అందజేస్తున్న కలెక్టర్

ఆర్థిక సాయం

చాగలమర్రి మండలం, చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి మృతి చెందిన సంఘటనలో బాధితులకు ఆర్థిక సాయం అందించినట్లు కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం పీజీఆర్ఎస్ హాల్లో జిల్లా మృతుల కుటుంబ సభ్యులకు రూ.4.50 లక్షల మెగా చెక్కును అందజేసి కలెక్టర్ మాట్లాడుతూ చాగలమర్రి మండలం, చిన్నవంగలి గ్రామంలో 2024 ఆగస్టు 2న భారీ వర్షాలకు మట్టిమిద్దె కూలి తల్లపురెడ్డి గురుశేఖర్ రెడ్డి, భార్య దస్తగిరమ్మ, కుమార్తెలు పవిత్ర, గురులక్ష్మి నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వారి రెండో కుమార్తె ప్రసన్న ప్రొద్దుటూరులోని ప్రభుత్వ హాస్టల్లో చదువుతుండటంతో ప్రమాదం నుంచి బయటపడిందన్నారు. కుటుంబ సభ్యులందరూ మృతి చెందడంతో దిక్కులేని విద్యార్థినిగా మిగిలిపోయింది. దీంతో వైఎస్సార్ కడప జిల్లా, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కానగూడూరు బ్రాంచ్ పీఎం ఎస్‌బీవై నుంచి రూ.2 లక్షలు, పీఎం జేజేవై నుంచి రూ. 2లక్షలు, క్రాప్ లోన్ యాక్సిడెంటల్ బీమాకు సంబంధించి రూ.50వేలు, మొత్తం రూ.4.50 లక్షల మెగా చెక్కును జిల్లా కలెక్టర్ విద్యార్థిని ప్రసన్న, ఆమె అవ్వ ఆవుల రామసుబ్బమ్మకు అందజేశారు.

కలెక్టర్, జేసీకి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

రక్షాబంధన్ పురస్కరించుకొని పట్టణంలోని ఎస్‌జీఓ కాలనీకి చెందిన బ్రహ్మకుమారీలు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్‌కు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఒక్కరూ శాంతి సౌభాగ్యాలతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న దృశ్యం

పౌష్టికాహారం అందించండి

జిల్లాలో ఉన్న టీబీ వ్యాధి గ్రస్తులకు స్వచ్ఛందంగా పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చేయూతనందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో హెచ్ఐవీ, సిఫిలీస్, టీబి వ్యాధి నిర్మూలనకు సంబంధించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 800 మంది వ్యాధి గ్రస్తులకు నెలకు రూ.500 చొప్పున అందజేస్తున్నామని, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి 30 మంది టీబీ పేషెంట్లకు పౌష్టికాహారం ఇచ్చేలా దత్తత తీసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రజలు, విద్యార్థులకు హెచ్ఐవీ, సిఫిలీస్ వ్యాధిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం హెచ్ఐవీ నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. జేసీ సి.విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్, అదనపు డీఎంహెచ్ఓ శారద పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఉయ్యాలవాడ: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా సత్వరం పరిష్కరించేందుకు చొరవ చూపాలని తహసీల్దార్ సువర్ణాదేవి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామానికి చెందిన చిట్టెపు శివశంకర్‌రెడ్డి, చిట్టెపు వెంకటసుబ్బారెడ్డి, పెద్ద సుబ్బారెడ్డిలు అనే రైతులు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. తమ పొలాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదని ఎందుకు నమోదు చేయలేదని అధికారుల పనితీరుపై మండిపడ్డారు. పడిగెపాడు, ఇంజేడు గ్రామాలకు చెందిన చిన్న సుబ్బారెడ్డి, పెద్ద సుబ్బారెడ్డి అనే రైతులు ఆన్‌లైన్‌లో తమ పేర్ల సవరణ కోసం గ్రామ సచివాలయాల్లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సత్వరమే బాధిత రైతులకు న్యాయం చేసేలా చర్యలు తీసకుంటామని తహసీల్దార్ వెల్లడించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడలో పీజీఆర్ఎస్‌కు హాజరైన అధికారులు

మహానందీశుడికి పల్లకీ సేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందీశ్వర దంపతులకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్థానిక అలంకార మండపంలో మహానందీశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించారు. గణపతి పూజ, అలంకార హారతులు ఇచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుంచారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం కనుల పండువగా సాగింది. ధ్వజస్తంభం వద్ద హారతులు ఇచ్చి పూజలు నిర్వహించి ఉత్సవ మూర్తులను తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

కోవెలకుంట్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ యాక్సిస్ బ్యాంకు, జొమాటో, అమెజాన్, దొడ్ల డెయిరీ, ఎన్ఎస్ ఇన్స్టిట్యూట్‌ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తదితర పది కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని పదో తరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఈడీ, ఎం ఫార్మసీ, పీజీ చేసిన నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 86886 51650, 97059 98056 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

శ్రీగిరి పంచమఠాలలో విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో లోకకల్యాణార్థం పంచమఠాలలో విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించారు. సోమవారం ఉదయం భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠాలలో పూజాదికాలు జరిపించారు. ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు జరిపారు. అనంతరం అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఏఈఓ హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా ఆలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీనులను చేసి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



రుద్రాక్షమఠం వద్ద పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు

వీసీ సెట్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

చాగలమర్రి: మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) సెట్‌లు ఏడాది నుంచి పని చేయడం లేదు. ఈ సమస్యపై గత నెల 8వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'పని చేయని వీసీ సెట్' శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన జిల్లా అధికారులు చాగలమర్రిలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న వీసీ సెట్‌కు మరమ్మతులు చేయించి బాగు చేశారు. దీంతో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని వీసీ సెట్ ద్వారా నిర్వహించి మండల అధికారులు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు.



వీసీ సెట్‌లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్న అధికారులు



చిలకలూరు వద్ద వంతెనపై ప్రవహిస్తున్న వక్కిలేరు వాగు



ఎర్రగుడిదిన్నె వద్ద మినుము పైరులో నిలిచిన నీరు

కుండపోత వర్షం

రుద్రవరం: మండలంలో ఐదు రోజుల నుంచి పలు విడతలుగా వర్షం కురుస్తోంది. దీంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. శిరివెళ్ల మండలం సర్వ నరసింహ స్వామి వైపు నుంచి మొదలై పేరూరు, ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు మీదుగా ఆళ్లగడ్డ వైపు వెళ్లే వక్కిలేరు వాగులో నీటి ప్రవాహం పెరిగింది. చిలుకలూరు గ్రామం పక్కనే లోతట్టు వంతెన ఉండటంతో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆ గ్రామస్తులు జాతీయ రహదారిపైకి వచ్చేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పొలాల్లో సాగు చేసిన వివిధ రకాల పంటలు నీట మునిగాయి. పలు గ్రామాల కాలనీలు చిత్తడిగా మారాయి.

శిరివెళ్ల: గత 3 రోజులుగా తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. సోమవారం 70 ఎంఎం వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారిపై గోవిందపల్లె, శిరివెళ్ల, యర్రగుంట్ల బస్ స్టేజీల వద్ద నిర్మించిన అండర్‌పాస్‌లలోకి నీరు చేరింది. దీంతో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే శిరివెళ్ల – యాళ్లూరు వరకు 8 కి.మీ ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు గుంతల్లో నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మండల కేంద్రంలోని ఆనకట్ట నిండా నీరు ఉంది. వర్షాలు అధికమైతే నీరు గ్రామంలోకి చేరుతుంది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు నీరు గ్రామంలోకి రాకండా నిరుపయోగంగా ఉన్న కాల్వలోకి మళ్లిస్తున్నారు. కాల్వలోని ముళ్ల పొదలను ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్నారు.

ఉయ్యాలవాడ: మండలంలో ఆది, సోమవారాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. చాలా గ్రామాల్లో మురుగు కాలువలు సరిగా లేకపోవడం, ప్రధాన కాలువల పక్కనే కల్వర్టుల వద్ద వర్షపు నీరు, మురుగు నీరు ముందుకు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రహదారులపై నీరు నిలిచింది. అల్లూరు, మాయలూరు, పుచ్చకాయలపల్లె, బోడెమ్మనూరు, సుద్దమల్ల గ్రామాల్లో కాలువల నుంచి వచ్చే మురుగు నీరంతా సిమెంట్ రోడ్లపై పారుతోంది. కాలువలు వెంట లోపలి భాగంలో చెత్తచెదారం అడ్డుపడడంతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. ఉయ్యాలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల చుట్టూ వర్షపు నీరు నిలిచిపోయింది. విద్యార్థులకు ఏటా వర్షాకాలంలో ఈ పరిస్థితి మామూలే. అధికారులు చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లి దండ్రులు కోరుతున్నారు.





శిరివెళ్ల మెట్ట వద్ద అండర్ పాస్ వేలో వర్షపు నీరు, శిరివెళ్ల - యాళ్లూరు ఆర్అండ్‌బీ రోడ్డుపై గుంతల్లో నీరు



ఉయ్యాలవాడ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన వర్షపు నీరు



అల్లూరులో ప్రధాన రహదారిపై పారుతున్న నీరు



వంతెనపై ప్రవహిస్తున్న నీరు



కుందూ నదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు

ఉధృతంగా కుందూ

- రాయపాడు సమీపంలో వంతెనపై పారుతున్న నీరు
- రాకపోకలకు అంతరాయం

గోస్పాడు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కుందూలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. రాయపాడు సమీపంలో కుందూ నదిపై ఏర్పాటు చేసిన వంతెనపై వర్షపు నీరు ప్రవహిస్తుంది. దీంతో అటువైపు వెళ్లే ప్రయాణికులు రాకపోకలు నిలిచిపోయాయి. నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు సూచిస్తున్నారు.

ఐడీబీఐ బ్యాంకును బలహీనపరచొద్దు

నంద్యాల: లాభాల బాటలో నడుస్తున్న, రూ.లక్షల కోట్ల రిజర్వులున్న ఐడీబీఐ బ్యాంకును డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం దుర్మార్గమని ఎల్ఐసీ యూనియన్ నంద్యాల బ్రాంచ్ సెక్రెటరీ కేపీ మనోజ్ విమర్శించారు. స్థానిక బ్రాంచ్ కార్యాలయం ఎదుట యూనియన్ అధ్యక్షుడు రవి శంకర్ శుక్లా ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగుల, అధికారుల దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావ నిరసన ప్రదర్శన నిర్వహించారు.మనోజ్ మాట్లాడుతూ దేశంలో 2,100 బ్యాంకు శాఖలతో, 4 లక్షల కోట్ల రిజర్వు నిధులతో ఐడీబీఐ పనిచేస్తున్నదన్నారు. 10 ఏళ్ల కిందట నష్టాల్లో ఉన్న ఐడీబీఐని ఎల్ఐసీ కొని దానిని లాభాల బాటలోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. మూడేళ్లలో రూ. పదివేల కోట్ల లాభాలు సాధించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.7026 కోట్ల నిర్వహణ లాభాల్ని, రూ.209 కోట్ల నికర లాభాన్ని సాధించిందని వివరించారు. ఇంత సమర్థవంతంగా పనిచేస్తున్న బ్యాంక్‌ను డిజిన్వెస్ట్ చేయాలనుకోవటం ప్రైవేటు, విదేశీ కంపెనీలకు ఊడిగం చేయడమేనని ఆరోపించారు.నాయకులు హరిప్రియ, రమేష్ బాబు, రామకృష్ణుడు, శేషగిరి, షాకీర్, శ్రీవల్లి, దస్తగిరి, శివ నందిని, సత్యనారాయణ, రంగన్న పాల్గొన్నారు.



ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

నిరసన గళం

వాహనమిత్ర కింద రూ.25వేలు ఇవ్వండి

నంద్యాల(న్యూటౌన్): ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఏపీ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఉచిత బస్సుతో ఆటో డ్రైవర్లకు బాడుగలు తగ్గుతాయని, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద రూ.25వేలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు నాగరాజు, ఎల్లాసుబ్బుడు, నాగేంద్ర, సురేష్, గంగయ్య పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కార్మికుల వేతనాలు పెంచాలి

నంద్యాల(న్యూటౌన్): గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్ అమలు చేసి, వేతనాలు పెంచి టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తిమ్మరాజు డిమాండ్ చేశారు. సోమవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంచాయతీ నిధులతో సంబంధం లేకుండా నేరుగా వేతనాలు ఇవ్వాలని, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. 40 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు బెనిఫిట్స్ ఏమీ లేవన్నారు. 550 జీవో ప్రకారం పీఎఫ్ అమలు చేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కార్మికులు దేవదాసు, ఓబులమ్మ, వసంత, రమాదేవి, మౌలాలి, చిన్న ఓబులమ్మ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు